క్లుప్తంగా

కోనేరును వినియోగం లోకి తీసుకురండి

జడ్చర్ల టౌన్: మున్సిపాలిటీ పరిధిలోని గచ్చు బావి, వెంకటేశ్వరస్వామి ఆలయ కోనేరులను బాగుచేసి వినియోగంలోకి తీసుకురావాలని దేవాదాయశాఖ సహాయ కమిషనర్‌కు వార్డుకౌన్సిలర్లు ఆలూరి శశికిరణ్, బుక్క మహేష్‌లు మంగళవారం వినతిపత్రం అందజేశారు. వందలాది ఏళ్ల చరిత్ర కలిగిన వాటిని భావితరాలకు అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

ఎగ్గని నర్సిములు జన్మదిన వేడుకలు



అడ్డాకుల: బీజేపీ నియోజకవర్గ నాయకుడు ఎగ్గని నర్సిములు జన్మదిన వేడుకలను మండలంలోని జాతీయ రహదారి పక్కన గాజులపేట స్టేజీ సమీపంలోని ఫాంహౌస్ వద్ద మంగళవారం నాయకులు, అభిమానులు ఘనంగా నిర్వహించారు. సందర్భంగా ఏర్పాటు చేసిన శిబిరంలో సుమారు 75 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. రాష్ట్ర నాయకులు శాంతికుమార్, డోకూర్ పవన్‌కుమార్‌రెడ్డి, వీరబ్రహ్మాచారి, పద్మజారెడ్డి, సుదర్శన్‌రెడ్డి, దేవరకద్ర బాలన్న, ఎస్‌పీ వెంకటేష్, గొల్ల అంజనేయులు, రవీందర్‌రెడ్డి, మున్నూర్ రమేష్, వేగనాథ్, బీసీ సంఘం నాయకులు రాచాల యుగేందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం

కోయిల్‌కొండ: మల్కాపూర్ గ్రామానికి చెందిన వడ్డెపెద్దరాజు, అభంగపట్నం గ్రామానికి చెందిన కుమారస్వామి సోమవారం రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన విషయం తెలిసిందే. ఈ మేరకు మంగళవారం వింజామూర్ మాజీ సర్పంచ్ కుమ్మరిరాములు బాధిత కుటుంబాలకు రూ.10వేల చొప్పున ఆర్థికసాయం అందజేశారు.

విద్యార్థి చదువుకు..

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రం ప్రేమ్‌నగర్‌కు చెందిన కొత్తకాపు పూజిత చదువు కోసం పాలమూరు రెడ్డి సేవా సమితి ఆధ్వర్యంలో చేయూత అందించారు. రూ.45వేల ఆర్థికసాయం మంగళవారం అందజేశారు. ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు తూము ఇంద్రసేనారెడ్డి, ప్రధాన కార్యదర్శి పోతుల రాఘవారెడ్డి, కోశాధికారి వేపూరు రాజేందర్‌రెడ్డి, ప్రచార కార్యదర్శి నలమద్ది సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రేమ్‌రాజ్‌కు ఘన సన్మానం



కోయిల్‌కొండ: మండల తహసీల్దార్ ప్రేమ్‌రాజ్‌కు డిప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతి రావడంతో మంగళవారం మండలాధికారులు, నాయకులు ఘనంగా ఆయనను సన్మానించారు. ఎంపీపీ శశికళ, జెడ్పీటీసీ విజయ్‌భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రేమ్‌రాజ్ సేవలను కొనియాడారు. ఎంపీడీఓ జయరాములు, డిప్యూటీ తహసీల్దార్ మురళి, సూపరింటెండెంట్ హరిశ్చంద్రారెడ్డి, మొగులయ్య, శ్రీనివాస్‌రెడ్డి, యాదయ్య, రాజవర్ధన్‌రెడ్డి, భీంరెడ్డి, డీలర్ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ సైనికుల సమస్యలు పరిష్కరించాలి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): జిల్లాలో ఉన్న మాజీ సైనికుల సమస్యలను పరిష్కరించాలని సొసైటీ జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డి కోరారు. ఈ మేరకు మంగళవారం మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. మాజీ సైనికులకు డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇవ్వాలని కోరారు. సైనిక్‌భవన్‌లో లిఫ్ట్‌ను ఏర్పాటు, ప్రహరీ నిర్మాణానికి ఆర్థికసాయం చేయాలని కోరారు. ప్రధాన కార్యదర్శి నాగేశ్వర్, వెంకటయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో ఏడుగురికి జరిమానా

బాలానగర్: డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 7గురికి జడ్చర్ల జూనియర్ సివిల్ జడ్జ్ కం ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ లక్ష్మి మంగళవారం రూ. వెయ్యి చొప్పున జరిమానా విధించారు. వీరంతా బాలానగర్ మండలానికి చెందిన వారని ఎస్‌ఐ జయ ప్రసాద్ తెలిపారు. తాగి వాహనాలు నడపితే చర్యలు తప్పవన్నారు.

హరితహారానికి మొక్కలు సిద్ధం చేయాలి

నవాబుపేట: హరితహారం కార్యక్రమం కోసం మొక్కలు సిద్ధం చేయాలని ఏపీఓ జ్యోతి, ఈఓపీఆర్‌డీ బద్రునాయక్ తెలిపారు. మండలంలోని కామారం, హజిలాపూర్, కాకర్‌జాల్, గురుకుంట, రుద్రారం గ్రామాల్లో నర్సరీలను వారు పరిశీలించారు. నీరు క్రమం తప్పకుండా పోయాలని, మొక్కలు నాటే సమయంలో జాగ్రత్తలు పాటించాలని అన్నారు. సర్పంచ్‌లు గోపాల్‌గౌడ్, వెంకటేష్, లలితమ్మ, జయమ్మ, లక్ష్మమ్మ తదితరులు ఉన్నారు.

నత్తనడకన నిర్మాణం



ముందలి తండాలో కిచెన్ షెడ్డులో కొనసాగుతున్న పంచాయతీ కార్యాలయం



సాలార్‌నగర్‌లో డ్వాక్రా భవనంలో పంచాయతీ కార్యాలయం

- పంచాయతీలకు సమకూరని సొంత భవనాల
- నిధులున్నా నిర్మాణంలో నిర్లక్ష్యం
- పట్టించుకోని అధికారులు

గండేడ్: పాలనలో పారదర్శకత, పటిష్ట అభివృద్ధి, పనుల్లో వేగవంతం, సుస్థిర పాలన తదితర అంశాలను దృష్టిలో ఉంచుకొని కొత్త గ్రామపంచాయతీల ఏర్పాటుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. గిరిజన తండాలతో పాటు మిగతా వాటిని జనాభా ప్రాతిపదికన కొత్తగా పంచాయతీలుగా ఏర్పాటు చేసింది. పాలనా సౌలభ్యం కోసం వీటిని ఏర్పాటు చేయడంతో పాటు అంతకుముందు ఉన్న గ్రామపంచాయతీల్లో ఆధునిక వసతులు కల్పించాలన్న ఉద్దేశంతో భవనాలకు నిధులు మంజూరు చేసింది. కాగా కొందరు అధికారుల నిర్లక్ష్యంతో ఏళ్లు గడుస్తున్నా వాటి నిర్మాణంలో ప్రగతి కానరావడం లేదు. ఎక్కడ చూసినా నిర్మాణాలు నత్తనడకన సాగుతున్నాయి. మరికొన్ని చోట్ల అసలే ప్రారంభం కాలేదు. అధికారులు, కాంట్రాక్టర్ల నిర్లక్ష్య ధోరణికి తోడు స్థలాల కొరత కూడ పక్కా భవన నిర్మాణాలకు అవరోధంగా మారింది. గతంలో ఉమ్మడి గండేడ్ మండలంలో 24 గ్రామపంచాయతీలు ఉండగా గండేడ్, మహమ్మదాబాద్ మండలాలు వేరుపడ్డాక గిరిజన తండాలు కలుపుకుని 49 గ్రామపంచాయతీలు ఏర్పాటయ్యాయి. వీటిలో కేవలం పాత 24 గ్రామపంచాయతీలకు మాత్రమే పక్కా భవనాలు ఉన్నాయి. మిగత గ్రామాల్లో పక్కా భవనాల నిర్మాణాలకోసం ఎస్డీఎస్‌ఎఫ్, ఎన్ఆర్ఈజీఎస్, రూర్బన్ పథకాల కింద 21 భవనాల నిర్మాణం కోసం రూ.20 లక్షల చొప్పున నిధులు మంజూరయ్యాయి. కాని నిర్మాణంలో తీవ్రంగా జాప్యం జరుగుతోందని ఆయా గ్రామాల ప్రజలు అంటున్నారు.

ఉమ్మడి గండేడ్ మండలంలో రంగారెడ్డిపల్లి, చిన్నవార్వల్, ఆశిరెడ్డిపల్లి, చెన్నాయిపల్లి తండా, జంగంరెడ్డిపల్లి , అన్నారెడ్డిపల్లి, మహమ్మదాబాద్, సంగాయిపల్లి, ధర్మాపూర్ తదితర గ్రామాలకు పక్కా భవనాలు మంజూరయ్యాయి. కాగా గండేడ్ మండలంలో జూనంపల్లి, సాలార్‌నగర్ గ్రామాల్లో నూతన గ్రామపంచాయతీల నిర్మాణానికి గాను స్థలం లేకపోవడంతో నిర్మాణ ప్రక్రియ అసలే ప్రారంభం లేదు.అన్నారెడ్డిపల్లి, మొకర్లాబాద్ తండా, కంచన్‌పల్లి, అన్నారెడ్డిపల్లి, ధర్మాపూర్, మహమ్మదాబాద్‌లలో ఇంకా భవన నిర్మాణాలు చేపట్ట లేదు. ఆముదాల గడ్డ పంచాయతీ నిర్మాణానికి టెండరు పిలిచినా ఎవరూ ముందుకు రాలేదు. చౌదర్‌పల్లి తండా, మంగంపేట్ తండాల్లో రెండు స్కీం కింద నిధులు మంజూరయ్యాయి. దీంతో ఎన్ఆర్ఈజీఎస్ కింద మంజూరయిన నిధులు క్యాన్సిల్ చేశారు. ఎస్డీఎస్‌డీఎఫ్ కింద వీటి నిర్మాణాలు చేపట్టాల్సి ఉండగా ఇంకా పనులు ప్రారంభం కాలేదు. పాత గ్రామపంచాయతీ భవనాల స్థానంలో కొత్త వాటి నిర్మాణానికి నిధులు వెచ్చించినా వాటి నిర్మాణానికి సైతం గ్రహణం పట్టుకుంది. సకాలంలో బిల్లులు అందడం లేదన్న సాకుతో వాటి నిర్మాణానికి అడ్డంకిగా మారింది. దీంతో సభలు సమావేశాలు నిర్వహించుకోడానికి ఇబ్బందులు తప్పడం లేదు.

ఇదిలా ఉంటే ధ్రువీకరణ పత్రాలు స్థానికంగా అందించడం, పన్నులు ఇతరత్రా సులభంగా కట్టుకోవడం వంటి వాటికోసం ఈ పంచాయతీలను ఏర్పాటు చేశారు. అవసరమైన సాంకేతిక పరికరాలు కంప్యూటర్లు, నెట్ కనెక్షను వంటివి అందజేశారు. ఇందుకు గాను ప్రత్యేకంగా భవనాలు నిర్మించాలని రూర్బన్ పథకం కింద 9.8 లక్షల మంజూరుచేసింది. కాని ఇవి చాలా చోట్ల అర్ధాంతరంగా ఆగిపోయాయి. రెడ్డిపల్లి, జిన్నారం, రుసుంపల్లి, మంగంపేట్ తదితర గ్రామాల్లో నిర్మాణాలు అసంపూర్తిగా ఉన్నాయి.

ఆయా గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాల భవనాలు, ప్రైవేటు ఇళ్లల్లో పంచాయతీ కార్యాలయాలు కొనసాగిస్తున్నారు. దీంతో ఇప్పటికైనా అధికారులు స్పందించి త్వరిత గతిన నిర్మాణాలు పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

స్థలం చూయించడం లేదు



సాలార్‌నగర్ కొత్త గ్రామపంచాయతీగా ఏర్పాటయ్యింది. పక్కా భవనం లేకపోవడంతో డ్వాక్రా భవనంలో తాత్కాలికంగా కొనసాగిస్తున్నాం. అందులో సభలు పెట్టుకోడానికి కూడా కష్టంగా ఉంది. ఎన్ఆర్ఈజీఎస్ కింద రూ.20 లక్షలు మంజూరయ్యాయి. స్థలం చూయించాలని అధికారులను కోరినా స్పందించడం లేదు. గ్రామ కంఠం భూమి ఉంది. సర్వే చేయించి స్థలం కేటాయించాలని రెవెన్యూ అధికారులను కోరాం. కానీ ఇప్పటికీ స్పందన లేదు.

– బంటు సత్యమ్మ, సర్పంచ్, సాలార్‌నగర్

పూర్తి చేయాలని ఒత్తిడి చేస్తున్నాం

అన్ని గ్రామాల్లోనూ పంచాయతీ భవనాలు త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టర్లు, సర్పంచులపై ఒత్తిడి తెస్తున్నాం. ఈ పంచాయతీ భవన నిర్మాణం పనులు సగం మేర పూర్తి అయ్యాయి. మిగతా పని కూడా పూర్తి చేయించేలా చర్యలు తీసుకుంటున్నాం. అవసరమున్న చోట్ల స్థలం చూయించాలని రెవెన్యూ అధికారులను కోరాం. వీలైనంత త్వరగా నిర్మాణాలు పూర్తి చేస్తాం.

– రాబర్ట్, పంచాయత్‌రాజ్, ఏఈ, గండేడ్

8 నుంచి ప్రతిష్ఠాపనోత్సవాలు



పంచాంగల్‌తండా ఆంజనేయస్వామి ఆలయం

గండేడ్: పంచాంగల్ తండాలో ఈనెల 8వ నుంచి ఆంజనేయస్వామి ప్రతిష్ఠాపనోత్సవాలు నిర్వహించనున్నట్లు సర్పంచ్ రాజునాయక్, మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు పెంట్యానాయక్ తెలిపారు. 10వ తేదీ వరకు ఉత్సవాలు ఉంటాయన్నారు. 8న గణపతి పూజ, పుణ్యవచనం, అంకురార్పణ, అగ్ని ప్రతిష్ఠ, ఫలపుష్ప జలాధివాస కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 9న ద్వార పూజ, మూలమంత్ర, పంచసూక్త హోమాలు, క్షీరాధివాసం నిర్వహించనున్నారు. 10న యంత్ర, విగ్రహ, ప్రాణ ప్రతిష్ఠ, ప్రథమ దర్శనం, మహామంగళహారతి అన్నదాన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరుకావాలని కోరారు.

హజ్‌యాత్రికులకు సత్కారం



స్టేషన్ మహబూబ్‌నగర్: ఈ ఏడాది పవిత్ర హజ్ యాత్రకు వెళుతున్న జిల్లాకు చెందిన పలువురు యాత్రీకులను జిల్లా కేంద్రంలోని ఆస్తానే బాదేషా ఆవరణలో ఘనంగా సత్కరించారు. యాత్రీకులు సయ్యద్ ఇస్మాయిల్, మహ్మద్ అబ్దుల్ ఖదీర్, ఎండీ తాహెర్‌లు ఉన్నారు. హజ్‌యాత్రలో మక్కా, మదీనాలో ప్రజల క్షేమం కోసం దువా చేయాలని వారిని కోరారు. అంతకుముందు ఖాజా బందానవాజ్ ఉర్సు ఉత్సవాల నేపథ్యంలో నాథియా ముషాయిరా నిర్వహించారు. పలువురు భక్తిగీతాలు ఆలపించారు. కార్యక్రమంలో ముతవల్లీ డాక్టర్ గియాజ్ పాష ఖాద్రీ, సుల్తాన్ చిష్తీ, జలీల్ నక్షబంది, ముస్తాక్ నక్షబంది, మహ్మద్ నఫీజ్ షర్ఫీ, వారిస్‌పాష షర్ఫీ, మహ్మద్ కలీం షర్ఫీ, షేక్ షరీఫ్ షర్ఫీ, జహంగీర్‌పాష ఖాద్రీ, ఇసాక్ షర్ఫీ, సమద్ షర్ఫీ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత

రాజాపూర్: ప్రతిఒక్కరు భక్తిభావన కల్గి ఉండాలని ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత లభిస్తుందని మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు కొప్పెరి బచ్చిరెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని శివసీతారామాంజనేయ ఆలయ పునర్‌నిర్మాణంతో పాటు విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాల్లో పాల్గొని పూజలు నిర్వహించారు. అనంతరం విగ్రహాలను గ్రామంలో ఊరేగించారు. ఆలయచైర్మన్ కృష్ణయ్య, కార్యదర్శి అచ్చయ్యగుప్తా, సభ్యులు రామకృష్ణ, మహిపాల్‌రెడ్డి, నరహరి, తదితరులు పాల్గొన్నారు.

నేడు సమావేశం

గండేడ్: మండల కేంద్రంలో బుధవారం సర్పంచులకు, ఎంపీటీసీలకు ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్లు గండేడ్ ఎంపీడీఓ రూపేందర్‌రెడ్డి తెలిపారు. గురువారం జరిగే చెరువుల పండుగ కార్యక్రమంపై సమీక్ష నిర్వహించనున్నట్లు వివరించారు. ఉదయం 11 గంటలకు ఎంపీడీఓ కార్యాలయంలో జరిగే ఈ సమావేశానికి ఉమ్మడి చెందిన అందరూ తప్పనిసరిగా హాజరు కావాలని ఆయన కోరారు.

వైఎస్సార్‌టీపీని బలోపేతం చేస్తాం



పార్టీ కార్యాలయ ప్రారంభోత్సవంలో పాల్గొన్న నాయకులు

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లాలో వైఎస్సార్ తెలంగాణ పార్టీని బలోపేతం చేస్తామని జిల్లా అధ్యక్షుడు మండడి సరోజ్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రం టీటీడీ కల్యాణ మండపం సమీపంలో ఏర్పాటు చేసిన జిల్లా కార్యాలయాన్ని మంగళవారం ప్రారంభించారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం పార్టీ అధినేత షర్మిల నిరంతరం పోరాటం చేస్తున్నారని, రాష్ట్ర వ్యాప్తంగా 3,800 కిలోమీటర్ల పాదయాత్ర చేపట్టారని వివరించారు. రాష్ట్రంలో పార్టీకి విశేష ఆదరణ లభిస్తోందన్నారు. మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి ఆశయ సాధనే ధ్యేయంగా పార్టీని ముందుకు తీసుకువెళ్తున్నట్లు వివరించారు. పార్టీ జడ్చర్ల కోఆర్డినేటర్ బీస మరియమ్మ, జిల్లా అధికార ప్రతినిధి బీడీ శామ్యూల్, పట్టణ అధ్యక్షుడు మహేందర్‌జీ, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు కాట్రావత్ ఆనంద్, ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు గడ్డం యాదయ్య, బీసీసెల్ అధ్యక్షుడు ప్రభాకర్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పొన్నకల్ పాఠశాలను పరిశీలించిన డీఈఓ



గామస్తులతో సమావేశమైన డీఈఓ రవీందర్

అడ్డాకుల: మండలంలోని పొన్నకల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మంగళవారం జిల్లా విద్యాధికారి రవీందర్ సందర్శించారు. మన ఊరు–మన బడి ద్వారా పాఠశాలలో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించిన ఫోటో షూట్‌ను చిత్రీకరించారు. తరగతి గదులు, గ్రీన్ బోర్డులు, డైనింగ్ హాల్, తాగునీరు, ఫర్నిచర్, డ్యూయల్ డెస్కులను డీఈఓ స్వయంగా పరిశీలించారు. తర్వాత వాటిని ప్రత్యేక కెమెరాలతో చిత్రీకరించారు. పాఠశాలను చాలా అందంగా తీర్చిదిద్దారని గ్రామస్తులను అభినందించారు. కార్యక్రమంలో ఎంపీపీ నాగార్జున్‌రెడ్డి, ఎంఈఓ నాగయ్య, సర్పంచ్ కల్పనా విజయకుమార్‌రెడ్డి, మాజీ జెడ్పీ కోఆప్షన్ మహిమూద్, గ్రామస్తులు అనంతరెడ్డి, మన్నెంకొండ, శ్రీశైలం తదితరులు ఉన్నారు.

జోరుగా సాగుతున్న 'బడిబాట'



జడ్చర్ల మండలంలో అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయుడు

జడ్చర్ల టౌన్: ప్రొఫెసర్‌జయశంకర్ బడిబాట కార్యక్రమం మండలంలో జోరుగా కొనసాగుతోంది. కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఎంఈఓ మంజులాదేవి పట్టణంలోని రాజీవ్‌నగర్ ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. అక్కడి ఉపాధ్యాయులతో కలసి బడిబాట కార్యక్రమంలో పాల్గొన్నారు. పెద్ద ఆదిరాల గ్రామపంచాయతీ పరిధిలోని రామస్వామిగుట్టతండాలో ఉపాధ్యాయులు ర్యాలీ నిర్వహించి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే పిల్లలను చేర్పించాలని ప్రతిజ్ఞ చేయించారు. ఉపాధ్యాయులు కృష్ణనాయక్, తాహెర్, పీఎస్ ప్రధానోపాధ్యాయుడు రవి తదితరులు పాల్గొన్నారు.

నవాబుపేట: బాడి బాట కార్యక్రమంలో అందరు బాగస్వాములై విద్యార్థులను పాఠశాలలకు రప్పించాలని తహసీల్దార్ రాజేందర్‌రెడ్డి, ఎంపీడీఓ శ్రీలత అన్నారు. లోకిరేవు, లింగంపల్లి, ఇప్పటూర్ గ్రామాల్లోని పాఠశాలల ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులతో మంగళవారం మాట్లాడారు. సీఆర్పీ జనార్దన్, హెచ్ఎంలు నర్సింహులు, ప్రసాద్, కృష్ణయ్య, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

రాజాపూర్: మండలంలోని గ్రామాల్లో ప్రభుత్వ ఉపాధ్యాయులు బడిబాటలో భాగంగా ఇంటింటి ప్రచారం చేపట్టారు. కల్లేపల్లి, రాయపల్లి, తిర్మలాపూర్ తదితర గ్రామాల్లో మంగళవారం ఉపాధ్యాయులు అవగాహన కల్పించారు.



కల్లేపల్లిలో ప్రచారం నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

దుర్భాషలాడిన వ్యక్తిపై ఫిర్యాదు

మహమ్మదాబాద్: విలేకరులపై దూషణకు దిగిన ఓ వ్యక్తిపై పోలీసులకు ఫిర్యాదు చేసిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. గాధిర్యాల్ ఊర చెరువులో మంగళవారం ఎలాంటి అనుమతి లేకుండా కొందలు అక్రమంగా మట్టి తీశారు. ఈ క్రమంలో అక్కడి నుంచి వెళ్తున్న పత్రికా విలేకరులు ఫోటోలు తీశారు. అనుమతి ఉందా అని ఆరాతీయగా వారిపై మట్టితీయిస్తున్న సదరు వ్యక్తి దూషణకు దిగారు. సర్పంచ్ వెంకట్రాంరెడ్డి ఇరువురికి సర్దిచెప్పి పంపించాడు. ఈమేరకు సదరు విలేకర్లు దూషించిన వ్యక్తిపై పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐ సైదయ్యకు ఫిర్యాదు చేశారు. ఇదిలా ఉంటే అక్కడికి వచ్చిన రెవెన్యూ సిబ్బంది, ఆర్ఐని సైతం లెక్కచేయకుండా మాట్లాడటంతో వారు కూడా సదరు వ్యక్తిపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తామని తెలిపారు.

సీఎంసభకు తరలిన నాయకులు



అన్నాసాగర్ నుంచి సభకు వెళ్తున్న నాయకులు

భూత్పూర్: నాగర్‌కర్నూల్ జిల్లాలో మంగళవారం సీఎం కేసీఆర్ సభకు మండల నాయకులు భారీగా తరలివెళ్లారు. మున్సిపాలిటీతో పాటు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

అడ్డాకుల: మూసాపేట, అడ్డాకుల మండలాల్లోని గ్రామాల నుంచి మంగళవారం నాగర్‌కర్నూల్ జిల్లాలో జరిగిన సీఎం కేసీఆర్ సభకు బీఆర్ఎస్ నాయకులు భారీగా తరలి వెళ్లారు. జెడ్పీటీసీ సభ్యులు రాజశేఖర్‌రెడ్డి, ఇంద్రయ్యసాగర్, ఎంపీపీలు నాగార్జున్‌రెడ్డి, కళావతి, విండో అధ్యక్షుడు జితేందర్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, పార్టీ అధ్యక్షులు శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మీనర్సింహ్మా ఆధ్వర్యంలో కార్యక్రమం చేపట్టారు.

కుల వృత్తులకు ఆర్థికసాయంపై హర్షం

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): కులవృత్తుల వారికి ప్రభుత్వం రూ. లక్ష ఆర్థికసాయం అందించాలని నిర్ణయం తీసుకోవడంపై నాయి బ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు ధన్‌రాజు మంగళవారం ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. దరఖాస్తులు తీసుకొనే ప్రక్రియను వేగంగా పూర్తిచేయాలని సీఎం కేసీఆర్ అధికార యంత్రాంగానికి ఆదేశించడం శుభపరిణామమని అన్నారు. 9 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

అనాథ శరణాలయంలో అన్నదానం

పాలమూరు: అక్షయ పాత్ర యువజన అసోసియేషన్ పాలమూరు ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కేంద్రంలోని ఏనుగొండ రెడ్‌క్రాస్ అనాథ శరణాలయ విద్యార్థులకు అన్నదానం నిర్వహించారు. అనంతరం పండ్లు పంపిణీ చేశారు. అధ్యక్షుడు రమేష్‌రెడ్డి మాట్లాడుతూ రెడ్‌క్రాస్ నిర్వహణలో పిల్లలు క్రమశిక్షణతో ఉన్నారని, భవిష్యత్‌లో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సభ్యులు ప్రశాంత్, చవాన్, సాయిచంద్, సలీం, నరేష్, అహ్మద్ జానీ, మేరాజ్, సందీప్, శరత్‌చంద్ర(నాని), గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

చెరువుల పండుగకు ఏర్పాట్లు



దేవరకద్ర: దశాబ్ది ఉత్సవాలలో భాగంగా దేవరకద్ర పెద్ద చెరువు వద్ద గురువారం జరిగే చెరువుల పండుగ, కట్ట మైసమ్మ ఉత్సవాలకు భారీగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఎంపీడీఓ శ్రీనివాసులు, ఈఓ సీత్యానాయక్‌తో మత్స్యకార సంఘం నాయకులు ఉత్సవాలకు సంబంధించి మంగళవారం స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా సంస్కృతి కార్యక్రమాలు, విందు భోజనాలు ఏర్పాటు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

ఘనంగా బోనాల పండుగ



బస్వాయపల్లిలో బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న భక్తులు

దేవరకద్ర: మండలంలోని బస్వాయపల్లి గ్రామంలో మంగళవారం ఘనంగా బోనాల పండుగ ఘనంగా నిర్వహించారు. గ్రామ దేవత పోచమ్మ తల్లికి ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. పిల్లలు, పెద్దలు మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం గ్రామంలోని మహిళలు బోనాలతో భారీ ఎత్తున ఊరేగింపు నిర్వహించారు. పోచమ్మ దేవాలయం వద్దకు చేరుకుని ప్రదక్షిణలు చేశారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు పూనకాలు ఊగారు.

కాంప్లెక్స్ నిర్మించేవరకు పోరాడుతాం



అసంపూర్తి కాంప్లెక్స్‌లో దీక్షలు చేపట్టిన బాధితులు

దేవరకద్ర: మండల కేంద్రంలోని రాయిచూర్ రోడ్‌లో సగంలో నిలిచి పోయిన వీరప్పయ్య దేవస్థానం కాంపెక్స్ షాపుల నిర్మాణం పనులు చేపట్టాలని డిమాండ్ చేస్తూ బాధితులు చేపట్టిన దీక్షలు మంగళవారం పదో రోజుకు చేరాయి. ఈ సందర్భంగా పలువురు బాధితులు మాట్లాడుతూ కాంప్లెక్స్ నిర్మించే వరకు పోరాటం ఆపేదిలేదని హెచ్చరించారు. అధికారులకు, ప్రజాప్రతినిధులకు పలుమార్లు విన్నవించిన ఫలితం లభించలేదని వాపోయారు. నాగిరెడ్డి, రామ్‌రమేశ్, రాజు, బాల్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్‌పై సస్పెన్షన్ ఎత్తివేత



సర్పంచ్‌గా తిరిగి బాధ్యతలు చేపట్టిన నీలిమను సన్మానిస్తున్న గ్రామస్తులు

భూత్పూర్: మండలంలోని అన్నాసాగర్ సర్పంచ్ కరెంట్ నీలిమపై సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని హైకోర్టు జిల్లా కలెక్టర్‌ను ఆదేశించింది. ఈ మేరకు మంగళవారం ఆమె వెల్లడించారు. తనపై రూ.14 లక్షలు అభియోగం మోపి అప్పటి కలెక్టర్ వెంకట్రావు సస్పెండ్ చేశారన్నారు. ఈ మేరకు సవాల్ చేస్తూ హైకోర్టును ఆదేశించగా ఏప్రిల్ 24న సస్పెండ్‌ను ఎత్తివేయాలని లిఖిత పూర్వక ఆదేశాలు జారీ చేసిందన్నారు. దీంతో జూన్ 3న సస్పెండ్‌ను ఎత్తివేసినట్లు ప్రస్తుత కలెక్టర్ ఉత్తర్వులు ఇచ్చినట్లు వివరించారు. తిరిగి మంగళవారం నుంచి బాధ్యతలు చేపట్టినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా నీలిమను గ్రామస్తులు సన్మానించారు.

స్నేహితుడి జ్ఞాపకార్థం రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న యువకులు

పాలమూరు: స్నేహితుడి జ్ఞాపకార్థం మిత్రులందరూ అందరూ కలిసి రక్తదాన శిబిరం నిర్వహించి రక్త నిల్వలు సేకరించి ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి అందజేశారు. జిల్లా కేంద్రంలోని బండమీదిపల్లికి చెందిన బండారి విశాల్ యాదవ్ గత ఏడాది మృతి చెందాడు. అతని జ్ఞాపకార్థం మంగళవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. జనరల్ ఆస్పత్రిలో రక్త నిల్వలు తక్కువగా ఉన్న సమయంలో యువకులు ముందుకు రావడం గొప్ప విషయమని బ్లడ్ బ్యాంకు నిర్వాహకుడు మధుసూదన్‌రెడ్డి అన్నారు. ఆస్పత్రి వైద్యురాలు విద్యారాణి, సిబ్బంది కోటేశ్వర్‌రెడ్డి, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.